
సుబ్బారావు పొద్దున్నే మా ఇంటికి పరుగెత్తుకువచ్చి తనకు సర్వీసు కమిషను దగ్గరనుంచి ఇంటర్వ్యూకు రమ్మని ఉత్తరం వచ్చిందని వెల్లడించాడు. నేను కంగ్రాచ్యులేషన్సు చెప్పేలోగానే, ఆ ఉద్యోగం యొక్క గొప్పతనం తనకు రాబోయే జీతం వివరాలు, తనకింద ఉండగల గుమాస్తాల సంఖ్య, తను నిర్వహించాల్సిన బాధ్యతలు; పైకి ఎగబాకి పోవటానికి గల అవకాశాలు మొదలైనవి వివరించి చెప్పేశాడు అసలు ఆ ఉద్యోగానికి తనే తగినవాడినని, తనకోసమే ఆ ఉద్యోగం ఖాళీగా ఉందేమో నన్న అభిప్రాయం వెలిబుచ్చాడు. అయితే అది "గెజిటెడ్ ఆఫీసర్ రాంక్" కాదే అన్న బాధ పట్టుకు పీడిస్తోందన్నాడు. కాని "ఫ్యూచర్ ప్రాస్పెక్ట్సు" బాగా ఉన్న ఉద్యోగం కనుకనూ, ప్రస్తుతంలో 350 రూ. లు జీతం ఇస్తారు కనుకనూ, తనబోటి తెలివైనవాడు తెగ "షైను" అయిపోటానికి తగినది కనుకనూ ఈ ఇంటర్వ్యూకు వెళ్లటానికే నిశ్చయించుకున్నానన్నాడు. ఇటువంటి ఉద్యోగాలకు సాధారణంగా సెలెక్టు చేసుకునేటట్లయితేనే ఇంటర్వ్యూకు పిలుస్తారట. అల్లాటప్పాగాళ్లందర్నీ పిలవరట. కాబట్టి తను ఆఫీసరయిపోయినట్టే నన్నాడు. తనకు తోడుగా నన్ను కూడా రమ్మన్నాడు.

"సుబ్బారావు—ఉద్యోగాన్వేషణ" అనే అంశంపై మీకు కొద్దిగా వివరించాలసి ఉంటుంది. అసలు సుబ్బారావునాకు స్వయానా మేనత్త కొడుకు. వాళ్ల నాన్నగారు హైస్కూల్లో లెక్కల మేష్టారు. లెక్కల మేష్టార్లకు ఉండాల్సిన కరుకుదనం మొదలైనవాటికి ఆయనను మూర్తీభవించిన ఉదాహరణగా పేర్కొనవచ్చును. దానికి తోడు ఆయనకు క్రమశిక్షణ, విద్యా విధానం, మొదలైన విషయాలమీద ఖచ్చితమైన అభిప్రాయా లున్నాయి. వా టన్నిటినీ సుబ్బారావుమీద ప్రయోగించి అతన్ని "మోడల్ స్టూడెంటు" గా చెయ్యాలని ఆయన ఆశయం. అందుచేత మావాడు చీకటిపడేవేళకే ఇంటికి చేరుకోవటం; తర్వాత భోంచేసి చదువుకుని పది గంటలకే నిద్రపోవటం, తెల్లవారకట్లనే లేచి చదువుకోవటం; సినిమాల వంటి దురలవాట్లు లేకుండా చేసుకోవటం మొదలైనవి విధిగా, చెయ్యాల్సి వచ్చింది. అదీకాక సుబ్బారావుకు కూడా ఇటువంటి మంచి అభిప్రాయాలు ఉండటంచేత తనంతట తానే కొన్ని అమలుపరచేవాడు. క్లాసులో ముందర బెంచీమీద కూర్చోవటం, తీరికవేళల్లో క్లాసులో ఫస్టున వచ్చే కుర్రాళ్లతోనే మాట్లాడటం, అప్పుడప్పుడు లెక్చరరుగారిని తెలియని లెక్క లడగటం, సినిమాలు సాధ్యమైనంత తక్కువగా చూడటం, రోడ్లమీద అసలు తిరక్కపోవటం, ఇత్యాది పనులు తు. చ. తప్పకుండా ఆచరించేవాడు. ఈ తరహా కుర్రవాళ్లందరూ ఫస్టు క్లాసులో పాసయిపోతారన్న విషయం అందరికి తెలిసిందే. తనకు ఫస్టుక్లాసు రావటంతో నోబుల్ ప్రైజ్ వచ్చినంత సంబరపడిపోయాడు. ఇదే విధంగా ఎమ్మెస్సీ, డి. యస్సీ మొదలైనవి కూడా ఫస్టుక్లాసులో పాసయిపోయి ఒక గొప్పవాడ్నయిపోదా మనుకున్నాడు. ఆతర్వాత ఒక స్కాలర్ షిప్పుమీద ఎక్కి కూచుని అమెరికా, ఫ్రాన్సు షికారు వెళ్లి రావచ్చని సంబరపడ్డాడు. అయితే వాళ్ల నాన్నగారికి ఈ వ్యవహారం అంతగా రుచించలేదు. కలల అలలమీద తేలుతున్న పుత్రుణ్ని ఒక మంచిరోజు చూసుకుని నేలమీదకు దింపి, మంచి ఉద్యోగం చూసుకుని వేన్నీళ్లకు చన్నీళ్ల మాదిరిగా ఉండవలసినదిగా బోధించాడు. సుబ్బారావు దిగాలుపడినవాడై తల్లి ద్వారా తండ్రి మనస్సు మార్చాలని ప్రయత్నించాడు కాని, తల్లే అందుకు ఒప్పుకోకపోవటంవల్ల తప్పనిసరిగా ఉద్యోగాన్వేషణ చెయ్యవలసి వచ్చింది.

కాని తనబోటి మాధమాటిక్సు గ్రాడ్యుయేట్ మామూలు గుమాస్తా ఉద్యోగం చెయ్యటం చిన్నతన మనిపించింది. నలుగురు స్నేహితుల నడిగాడు తనబోటివాడు చెయ్యదగ్గ ఉద్యోగం ఏదైనా చెప్పమని. ఒకాయన ఐ ఏ. ఎస్. కు వెళ్లి కలక్టరయిపోవలసినదిగా సలహా యిచ్చాడు. అసలా మాట కొస్తే గెజిటడ్ ఆఫీసరుకు తక్కువ "రాంకు" ఉద్యోగం చెయ్యవద్దన్నాడు. పైగా ఇదే ఇంగ్లండో, అమెరికావో అయితే గద్దలాగా ఎగరేసుకు పోయేవారినిన్నీ, ఎప్పుడూ గుమాస్తా ఉద్యోగం చెయ్యనని ప్రమాణం చెయ్యమనీ కూడా అన్నాడు.

ఆరోజునుంచి ప్రతీ పేపరూ చూసేవాడు, ఎక్కడైనా గెజిటెడ్ ఆఫీసరు ఉద్యోగాలకు ఖాళీ లున్నాయేమోనని. అదేం ఖర్మో కాని అటువంటి ఉద్యోగాలకు అడ్వర్టయిజ్మెంట్లు చాలా తక్కువగా వచ్చేవి అథమం ఒక్కటైనా ఉన్నా, వాటికి బోలెడు గొంతెమ్మ కోరిక లుండేవి. పొరపాటున



కనీస విద్యార్హత "గ్రాడ్యుయేట్" అని ఉన్నా దానికి తోకలాగా అధమం అయిదు సంవత్సరాల అనుభవం కావాలని వేసేవారు. అయితేనేం మావాడు ఆశ వదులుకోలేదు. "తనకు గెజిటెడ్ ఆఫీసరు ఉద్యోగం ఇవ్వాల్సి వస్తుందని గవర్నమెంటువారు అసలు ప్రకటన చెయ్యటమే మానివేశా" రన్నాడు. తనబోటి "జీనియస్" ఇక్కట 'రాట'వుతున్నట్టు వాళ్లకు తెలియదేమోనని అభిప్రాయ పడ్డాడు. అసలు ఈ యూనివర్సిటీవాళ్లకు బుద్ధిలే దన్నాడు. ఎందుకంటే ఫస్ట్ క్లాసు గ్రాడ్యుయేట్ల లిస్టు ఒకటి గవర్నమెంటువాళ్లకు ఇచ్చేస్తే, వాళ్ళేమో ఈ లిస్టులోనుంచి తనబోటి వాళ్లను సెలక్టు చేసుకోవచ్చునట. అది చాలా తేలికగా ఉంటుందిట కూడాను. అటు గవర్నమెంటు వారికి ఇటు వీళ్లందరూకూ వ్యయప్రయాసలకు తగ్గుతాయి — ఈ ఊహ గవర్నమెంటువారికి తట్టకపోవటం మావాడి దురదృష్టమే మరి.

చివరకు ఒకరోజు పేపర్లో ఎటువంటి లక్షణాలు గల ఉద్యోగాలు కావాలని తను తహతహలాడిపోతున్నాడో సరిగ్గా అటువంటివే రెండు ఉద్యోగాలు కనుపించాయి. పైగా "ఫస్ట్‌క్లాసు గ్రాడ్యుయేట్లు అయితే చాలునని, పూర్వపు అనుభవం లేకపోయినా సరే, ఆఫీసరు ఉద్యోగాలు ఇచ్చేస్తామని, కావాల్సినవాళ్లు దరఖాస్తులు పంపుకోవచ్చునని" ప్రకటించారు. మావాడు తెగ మురిసిపోయాడు. ఆతర్వాత ఆ ఉద్యోగాలకు దరఖాస్తులు పడేశాడు అయితే ఒక చిక్కు వచ్చింది. ఈ రెండు ఉద్యోగాలు తనకు వచ్చేస్తే ఏ ఉద్యోగానికి వెళ్లటమూ అనేది పెద్ద సమస్యగా తయారయిం దన్నాడు. ఇంటర్వ్యూకు వెళ్లినప్పుడు ఆ ఉద్యోగం యొక్క "ప్యూచర్ ప్రాస్పెక్ట్స్" కనుక్కొని ఏ ఉద్యోగంలో చేరాల్సింది నిర్ణయిస్తా నన్నాడు.

ఇంక ఆ మర్నాటి నుంచి మావాడు ఇంకా ఇంటర్వ్యూకు రమ్మని ఉత్తరం రాలేదని నానా బాధ పడేవాడు. పోస్టుమాన్ కనుపించటం తర్వాయి. తనకు తప్పకుండా ఉత్తరం రావాలని, వెతికి చూడమని వేధించేవాడు. కొంతకాలం గడిచాక ఇంక తనకు ఇంటర్వ్యూ రాదనుకున్నాడు. మళ్లా ఉద్యోగ ప్రకటనలు వెతకటం మొదలు పెట్టాడు. ఈవిధంగా ఒక అరడజను ఉద్యోగాలకు అప్లయి చేయటమూ, వాళ్లు కనీసం సమాధానంగా "మా శాఖలో ఫలానా ఉద్యోగమునకు మీరు సెలక్టు కాలేదని తెలుపుటకు విచారించుచున్నాము" అని అయినా రాయకుండా ఉండటమూ జరిగింది. అయినా మావాడు ఆఫీసరు ఉద్యోగానికి ఆశ వదులుకోలేదు.

ఇది ఇట్లా ఉండగా ఇంటర్వ్యూ కోసరమని ఏవిధంగా తయారుకావాలో కొంతమంది పెద్దవాళ్లను అడిగి తెలుసుకున్నాడు. పేపరు తెప్పించి శ్రద్ధగా చదవటం మొదలుపెట్టాడు. జనరల్ నాలెడ్జి పుస్తకం ఒకటి కొనేశాడు. కెనడీ దగ్గర్నుంచి మావూరు పంచాయతీబోర్డు ప్రెసిడెంటు వరకు ఎవరెవరు ఏఏ పదవుల్లో ఉన్నారు, టోగో దేశపు ఎల్లలు ఏవి, హైబరు నది ఒడ్డున గల పట్టణము రాజధానిగా గల రాజ్యము ఏది, కొంగ గంటకు ఎన్నిమైళ్ల వేగముతో ఎగురును, ధర్మామీటరు పొడవు ఎంత, అలెగ్జాండరు మొదలుకొని చైనావారి వరకు హిందూదేశముపై ఎవరెవరు దండెత్తిరి, ప్రపంచములో గల ఎత్తయిన కట్టడములు, లోతైన కందకములు మొదలైనవన్నీ కంఠతా పట్టేశాడు. అప్పటికీ నమ్మకం కుదరక మాచేత రెండు, మూడు 'మాక్' ఇంటర్వ్యూలు కూడా పెట్టించుకున్నాడు. ఇంక ఇంటర్వ్యూలో తనకు డోకా లేదు పొమ్మన్నాడు.

ఈలోగా వాళ్ల నాన్నగారు ఇండియాలో ఆఫీసరు ఉద్యోగాలే కాకుండా గుమాస్తా ఉద్యోగాలు కూడా ఉన్నాయని, అవి కూడా చాలా బావుంటాయని, 150— రూ. ల దాకా సంపాదించవచ్చునని బోధించారు. అయితేనేం, మావాడు "నసేమిరా వినను" పొమ్మన్నాడు. తింటే గారలే తినాలి, చేస్తే ఆఫీసరు ఉద్యోగమే చేయాలి. కనుక తక్కువ ఉద్యోగాలు చెయ్యనన్నాడు.

* * *

ఏమైతేనేం ఇప్పుడు ఇంటర్వ్యూ వచ్చింది కనుక తన కష్టాలు గట్టెక్కాయని భావించాడు. ఇంటర్వ్యూ తరువాత ఉద్యోగం రావటం ఖాయం కాబట్టి తనింక బాధపడక్కర్లే దన్నాడు.

సర్వీస్ కమీషనువారి ఆఫీసుకు వెళ్ళేవరకు మావాడు ఇదే రకమైన అభిప్రాయాలు వెలిబుచ్చుతూనే ఉన్నాడు. అక్కడ చేరిఉన్న జనాభాను చూసేసరికి మావాడు గతుక్కుమని 'ఏవిట్రా ఇంతమంది చేరారు, కొంపదీసి అందరూ ఇంటర్వ్యూకే కాదుగదా" అని వాపోయాడు. విచారించగా అక్కడ ఉన్న వాళ్లలో చాలామంది ఇంటర్వ్యూకే నని తేలింది. అందులో ప్రతి ఒక్కరి ముఖంలోనూ "ఆఫీసరు" కళ ఉట్టిపడుతోంది. కొందరు గుంపులు గుంపులుగా చేరి మాట్లాడుకొంటున్నారు. ప్రక్కవాళ్లతో మాటాడ్డవే తమ గౌరవానికి భంగమన్నట్లుగా మూతి బిగించుకు కూచున్నారు కొందరు. కొంతమంది పుస్తకాలు పేపర్లు తెగ నమిలేసి భట్టీయం పట్టేస్తున్నారు. వాళ్ల ముఖాలలో ఆదుర్దా స్పష్టంగా కనుపిస్తోంది. మరికొందరు మన్నుతిన్న పాముల్లా గోళ్లు గిల్లుకుంటూ కూచున్నారు. కొందరేమో హాలు ఈ చివర్నించి ఆ చివరకు హడావుడిగా తిరిగేస్తున్నారు. దారిలో కనపడ్డవాళ్లను నిలేసి ఏమిటో అడిగేస్తున్నారు. మధ్యలో విట్లు కూడా వేస్తున్నారు.

అక్కడ చేరివున్న వాళ్ల మొహాలలోని భావాలనుబట్టి మూడు తరగతులుగా విభజించవచ్చు.

80—వ పేజీ చూడండి



మొదటి జాతివారు అర్జునుడు మత్స్య యంత్రం పడకొట్టినంత అవలీలగా తాము ఈ ఉద్యోగాన్ని "కొట్టెయ్యగల" మనే ధీమాతో ఉన్నారు. వాళ్ళు అప్పుడే ఆఫీసర్లయిపోయినట్లుగానే భావించుకొని అదే పద్ధతిలో నడుస్తున్నారు, కూచుంటున్నారు, మాట్లాడుతున్నారు కూడాను. రెండో తరగతి వారు చాలా బిడియస్థులు. మాట్లాడితేనే కొంప కొక్కడ అంటుకుంటాయో నన్న భయం స్పష్టంగా కనపడుతోంది. ఈ ఉద్యోగం వస్తుందో రాదోనని వూరికే మధనపడుతున్నారు. ఇంక మూడో గ్రూపువాళ్ళు దేన్నీ ఖాతరు చేస్తున్నట్లు లేదు. ఇలాంటివి ఎన్ని చూశామో అన్న ఫోజు పెట్టారు. వాటిలో ఇదొకటి. తగిల్తే మంచిదే, లేకపోతే మరీ మంచిది అన్నట్లు ఉన్నారు.

ఇంతలో మా పక్కన కూర్చున్నాయనకు వూరికే కూచోవటం విసుగు పుట్టింది కాబోలు ఏం చది వారని మావాడ్నడిగాడు. బియస్సీ ఫస్ట్‌క్లాసని ధీమాగా చెప్పాడు వీడు. మరి మీరేం చదివారు అని కూడా అడిగాడు.

"ఎమ్‌కామ్ ఎల్ ఎల్. బి" అన్నా డాయన. ఆ తరువాత ఇంకా ఇద్దరు ముగ్గురు వచ్చి మా క్వాలిఫికేషన్లడిగి వాళ్ళవి అడక్కుండానే వెల్లడించి వెళ్ళారు. చివరికీ తేలిందేమిటంటే ఇంటర్వ్యూకు వచ్చినవాళ్ళలో మూడొంతులమంది పోస్టు గ్రాడ్యుయేట్లని, మిగిలినవాళ్ళలో చాలామంది డబుల్ గ్రాడ్యుయేట్లనీను. అప్పటికే మావాడికీ కొద్దిగా దిగులు పట్టుకుంది. కాని అప్పటికేం చెయ్యలేక వూరుకున్నాడు.

ఇంతలో వో చిన్న కలకలం బయలుదేరింది. అక్కడున్నవాళ్ళంతా లేచి ఓ మూలకు పరుగెత్తుతున్నారు. ఏం కొంప మునిగిందోనని మేం కూడా పరుగెత్తాము. అక్కడ ఒకాయన కూచుని ఇంటర్వ్యూలో గల పరమార్థాన్ని బోధిస్తున్నాడు, దగ్గర మార్గాలు, అడ్డదార్లు మొదలైనవి విపులీక రిస్తున్నాడు. అసలు శ్రీకృష్ణ పరమాత్మ గీతను బోధించినంత సులువుగా "వోస్ ఇంతేనా ఇంటర్వ్యూ అంటే" అనిపించేటట్లు చెప్పేస్తున్నాడు. ఆతర్వాత "కాసబ్లాంకా కూటమి రాజ్యాలకు మన్రోవియా కూటమి రాజ్యాలకు టోగో ప్రెసిడెంటు హత్యను పురస్కరించుకుని యుద్ధం రాగలదా లేదా, కాంగో పరిస్థితి చక్కబడినట్లేనా ? మన బంగారపు కంట్రోల్ గురించి మీ అభిప్రాయ మేమిటి ? ప్రజలు — ప్రస్తుతపు బడ్జెటు అనే అంశ మును వివరించుము" అంటూ శరపరంపరగా ఒక డజను ప్రశ్నలు గుప్పించేసి "ఈ క్వొశ్చన్లు చాలా ఇంపార్టెంటండి. ఈ రోజుల్లో మీరు ఏ ఇంట ర్వ్యూకు వెళ్ళినా వీటిలో ఏ రెండు ప్రశ్నలైనా అడక్కపోతే చెవి కోయించుకుంటా" నన్నాడు. ఒక నిముషం ఆగి "మీలో ప్రతి ఒక్కరు ఉద్యోగానికి సెలక్టు కావాలని కాంక్షిస్తున్నాను. నేను చాలా బీదవాడ్ని, మీబోటివాళ్ళు సంతోషపూర్వకంగా సహాయంచేస్తే కృతజ్ఞుడ్ని" అని తన గోడు వెళ్ళబోసుకున్నాడు. ఈ మాటలు వినగానే అక్కడున్న వాళ్ళలో చాలామంది పులిని చూసినట్లుగా

# ఇంటర్వ్యూ

13 వ పేజీ తరువాయి

పారిపోయారు వారిలో ఒకాయన ఒక మహా సత్యాన్ని వెల్లడించినట్లుగా "ఇందుకనేనండి మన దేశం ఇంత హీనస్థితిలో ఉంది. అసలు ఇతన్ని హాలులోకి ఎవరు రానిచ్చారు" అని కోప్పడ్డాడు. కొంతమంది మాత్రం రూపాయో, అర్ధో ఇచ్చారు. మొత్తానికి వో పది రూపాయలదాకా పోగయింది. అతను అందరికి తన కృతజ్ఞతలు వెల్లడించి మళ్ళా అందరూ సెలక్టు కావాలని ఆశిస్తున్నానని సెలవు పుచ్చుకున్నాడు.

తరువాత ఒక గుమాస్తా వచ్చి అక్కడివాళ్ళందర్నీ వాళ్ళ ఉద్యోగాల వారీగా విభజించి వాళ్ళు ఎక్కడికి వెళ్ళి కూచోవాలో చెప్పి వెళ్ళిపోయాడు ఇంటర్వ్యూకు రాని నాబోటివాళ్ళు ఒక అరడజను మంది మాత్రం హాలులో మిగిలాము.

ఒక గంట పోయాక మావాడు ఏడుపు మొహంతో బయటకు వచ్చాడు. సంగతేమిటో చెప్పకుండానే వీధిలోకి లాక్కొచ్చాడు. తరువాత భోరుమని 'తనకు ఆఫీసరయ్యే యోగ్యత లేద న్నాడు. ఇంక జన్మలో ఇంటర్వ్యూకు వెళ్ళ నన్నాడు. ఇంటర్వ్యూలను, ఉద్యోగాలను, గవర్న మెంటును తిట్టిపోశాడు. చివరకు అసలు విషయం చెప్పేశాడు. అసలు సంగతేమిటంటే మొదట మేమున్న హాలులో హడావుడి తరువాత అక్కడి వాళ్ళలో చాలామంది పోస్టు గ్రాడ్యుయేట్లవటం మావాడ్ని కొద్దిగా గాభరా పెట్టింది. పైగా ఇంటర్వ్యూ గురించి వివరించినతని ఉపన్యాసం, ప్రశ్నలు వినగానే సగం నీరసించాడు. ఎందుకంటే అట్లాంటి ప్రశ్నలకు మావాడు "ప్రిపేరు" కాలేదు. దానికి తోడు వీడి పేరు ఆరోజు ఇంట ర్వ్యూకు వచ్చిన వాళ్ళలో మొదటిది కావటంచేత మిగిలినవాళ్ళను ఎలాంటి ప్రశ్నలు వేస్తున్నారో తెలుసుకునే అవకాశం లేకపోయింది.

ఇంటర్వ్యూ చేసే గదిలోకి అడుగు పెట్ట గానే అక్కడ కూర్చున్న నలుగురు మెంబర్లు మావాడి కంటికి కాటు వెయ్యటానికి సిద్ధంగా ఉన్న తాచుపాముల్లాగా, ఎర మీదకు దుమికే పెద్ద పులుల్లాగా, వినటానికి శ్రోతలు దొరికిన రాజ కీయ నాయకుడిలాగా, పాలసీ తీసుకుంటానన్న మనిషి దొరికిన ఇన్సూరెన్సు ఏజంట్లులాగా కనిపిం చారట అందులో ఒకాయన బట్టతలతో నున్న యముడులాగా ఉన్నాట ఆయన "విలన్" లాగా ఒక నవ్వు నవ్వి వీడ్ని కూర్చోమని "నేషనల్ ఎమర్జన్సీ" ఎందుకొచ్చిందో తెల్సాఅని గదమాయించి యించి అడిగాడు. వీడు బిక్కు బిక్కుమంటూ "తెలుసు" అన్నాడు. ఎందుకొచ్చిందో చెప్పు అని మళ్ళీ అడిగాట్ట. ఇంతలోనే మావాడికి అర్జెంటుగా తుమ్ము వచ్చింది. అప్పుడు తుమ్మితే ఆఫీసరు పద్ధతిలో ఉండదని అభిప్రాయపడినవాడై ఆప టానికి శత సహస్ర విధాల ప్రయత్నించాడు. కాని లాభంలేకపోయింది.

అటువంటి సమయంలో తుమ్ము వస్తుందని మావాడు కలలోనైనా వూహించలేదు. మావాడు ఆపటానికి ప్రయత్నించడంవలన దానికి కోపంవచ్చి ఇంకా ఎక్కువ ఫోర్సుతో హాచ్చీ . హాచ్చి ... హ్రాచ్రీ అనే శబ్దంతో మూడుగా బయటకు దూకింది అనుకోకుండా వచ్చిపడ్డ ఈ అవాంత రానికి కమిటీ మెంబర్లు నలుగురు స్తంభించి పోయారు. వారి మొహాలు చూడటానికి మావాడికి భయం వేసింది. తను చేసిన ఈ ఘోరకృత్యా నికి తనకు యావజ్జీవ కారాగారశిక్ష వేస్తారు కాబోలు నన్నట్లుగా భావించారు అసలు తనను తుమ్ము ఆపటం కూడా చేతకాని చవటగా జమ కట్టారేమోనని బాధపడ్డాడు. తనకిక గత్యంతరం ఏమిటి, చేతికొచ్చిన ఆఫీసరు ఉద్యోగం ఒక్క తుమ్ము మూలంగా చెయ్యిజారి పోతోందే. ఇహ ఎప్పటికైనా తనకు ఆఫీసరు ఉద్యోగం వస్తుందా అని మావాడు బాధపడుతున్న సమయంలోనే "బట్టతల యముడు" గారు ఒక ప్రశ్న వేశాడు. అది వీడికి సరిగా వినపడలేదు వినపడిన భాగానికి సమాధానం చెప్పటానికి నోరు పెకిలి రాలేదు. ఈలోగానే ఇంకొక మెంబరుగారు అందుకున్నాడు. దాంతో వీడికి గాభరా ఎక్కువయింది. ఏ ప్రశ్నకు సమాధానం చెప్పాలో అర్థంపాలేదు. మొత్తం ప్రశ్నలకు సమాధానంగా శ్రీ—కే. నెహ్రూగారు అంబాసడర్ జనరల్ ఆవ్ అమెరికా ఇన్ ఇండియా అనేశాడు. ఈ సమాధానం వినటంతోటే వాళ్ళకు మతిపోయి "అయ్యా తమరు ఇంక శలవు పుచ్చుకో వచ్చు" ననేశారు.

ఇదీ మావాడి మొదటి ఇంటర్వ్యూ ముచ్చట. ★

